
సాక్షి
సిద్దిపేట
గురువారం । 30 । మే । 2024



ఏడుపాయల్లో కన్నీటి ధారలు

ఏడుపాయల్లో ప్రవహించే మంజీరా ధారలు భక్తుల రక్తంతో ఎరుపెక్కుతున్నాయి.

వివరాలు 8లో ▸



దాహం తీరేలా..

అడవుల్లో సహజ నీటి లభ్యత లేకపోవడంతో సిబ్బంది సాసర్ పిట్‌లలో నీళ్లు పోసి దాహార్తి తీరుస్తున్నారు.

వివరాలు 8లో ▸



చేపల కోసం చెరువుకు గండి!

ఓ కాంట్రాక్టర్ చేపల కోసం అధికారుల అనుమతి లేకుండా చెరువుకు గండికొట్టి తూము ద్వారా నీటిని వదులుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బ్రహ్మాండనాయకుడికి లక్ష తులసి అర్చన



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుడు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ విద్యాస రస్వతి క్షేత్రంలోని వేంకటేశ్వరుని సన్నిధిలో బుధవారం శ్రవణ నక్షత్ర మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో అర్చకులు తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. పట్టువస్త్రాలు, సర్వాభరణాలు, పూలమాలలతో కమనీయంగా అలంకరించారు. స్వామివారి నామాలు పఠిస్తూ లక్ష తులసి దళాలు సమర్పించారు. భక్తులు పాల్గొని తరించారు.

జిల్లా వ్యవసాయాధికారి సస్పెన్షన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యవసాయాధికారిగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు నెలల క్రితం వ్యవసాయశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈ మేరకు సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేశారు.

నెమలిని రక్షించిన యువకులు



నెమలిని ఫారెస్టు అధికారికి అప్పగిస్తున్న యువకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కుక్కల దాడి నుంచి నెమలిని రక్షించి ఫారెస్టు అధికారులకు అప్పగించిన ఘటన చంద్లాపూర్ శివారులో బుధవారం జరిగింది. గ్రామ శివారులో నెమలిపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇది గమనించిన యువకులు కుక్కలను తరిమికొట్టి గాయపడ్డ నెమలికి ప్రథమ చికిత్స అందించారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్నారు. వెటర్నరీ ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం ఆక్సిజన్ పార్క్‌లో వదిలినట్లు చెప్పారు. నెమలిని రక్షించిన గ్రామ యువకులను ఆయన అభినందించారు.

బాలరత్నాలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాలరత్నాలు పుస్తకావిష్కరణ బుధవారం జరిగింది. తెలంగాణ సారస్వత పరిషత్ హైదరాబాదులో జరుగుతున్న బాలసాహిత్య సమ్మేళనంలో సిద్దిపేటకు చెందిన బాల సాహితీవేత్త పెందోట వెంకటేశ్వర్లు రచించిన బాలరత్నాలు పుస్తకావిష్కరణ జరిగినట్లు ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం తెలిపారు. కార్యక్రమంలో కవులు ఎన్నవెల్లి రాజమౌళి, కాంతికృష్ణ, ఎడ్ల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని టీపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు మల్లికార్జున్, తిరుపతి రెడ్డి, కనకయ్య, రాములు, పద్మయ్య, జమీర్ మొహియుద్దీన్, జానకి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా దోపిడీ!

కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారాజ్యం

పంట సీజన్లు మారుతున్నా రైతుల పరిస్థితి మాత్రం మారడం లేదు. పంట అమ్మేవోట రైతన్నకు అగచాట్లు తప్పడం లేదు. తేమ, తాలు, మట్టి బెడ్డలు అంటూ దోపిడీకి తెరతీస్తున్నారు. తాలు లేకున్నా, తేమ యంత్రాల పొరపాట్లనూ రైతన్నపైనే రుద్దుతున్నారు. అన్నదాత చేసేదిలేక తరుగుకు అంగీకరిస్తున్నారు. కొందరి మిల్లర్లపై ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారని అన్నదాతలు వాపోతున్నారు.

– సాక్షి, సిద్దిపేట

వరి రైతుకు తరుగు దెబ్బ

- క్వింటాలుకు ఆరు కిలోలు కోత
- నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు
- అయోమయంలో అన్నదాతలు
- ఇప్పటి వరకు 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



నాగులబండ కొనుగోలు కేంద్రం వద్ద తూకం వేస్తున్న హమాలీలు

జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం. ఇందుకు 418 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 62,574 మంది రైతుల నుంచి 2,64,304 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వాస్తవానికి 40.600 కిలోల ధాన్యానికి మించి గన్నీ బ్యాగులో నింప వద్దు. బ్యాగు బరువు 600 గ్రాములు తీసేసి 40కిలోలను లెక్కలోకి తీసుకోవాలి. ఒక్కో సంచిలో 42 కిలోల 300 గ్రాములు తూకం వేస్తున్నారు. లెక్కల్లో 40 కిలోలే రాస్తున్నారు. ఇలా క్వింటాల్‌కు ఆరు కిలోల వరకు తరుగు తీస్తున్నారు. నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.

మిల్లర్ల హుకుం

వరి పంట చేతికొచ్చే వేళ, కొనుగోలు కేంద్రాలకు తరలించిన తర్వాత వర్షాలు కురవడంతో నష్టాల పాలు చేశాయి. తడిసిన ధాన్యాన్ని నానా పాట్లుపడి రోజుల తరబడి ఆరబెడుతున్నారు. తీరా విక్రయిద్దామంటే కేంద్రాల్లో బస్తాకు కిలో నుంచి 2.5కిలోల తరుగు తీస్తున్నారు. సరేనంటే బస్తాలు అన్‌లోడ్ చేస్తాం..లేదంటే వెనక్కి తీసుకువెళ్లాలని పలు చోట్ల మిల్లర్లు హుకుం జారీ చేస్తున్నారు. చేసేది రైతులు తరుగుకు అంగీకరించి విక్రయిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి

పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరిగి ఏటికేడు నష్టాల్లో కూరుకుపోతున్న రైతన్నలకు ప్రకృతి వైపరీత్యాలతో తీరని నష్టం మిగులుతోంది. ఇది చాలదన్నట్లుగా మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారు.



బస్తాకు 42 కిలోల 300 గ్రాముల తూకం

దీంతో రైతులు దిక్కుతోచని స్థితికి గురవుతున్నారు. మిల్లర్లపై చర్యలు తీసుకొని అదనపు కోతలను అరికట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



ఒక్కో బస్తాకు 40 కిలోల బరువు వేయాల్సి ఉండగా 42.300 కిలోలు తూకం వేస్తున్నారు. ఇలా ఒక్కో బస్తాకు 2.300 కిలోలు ఎక్కువగా తూకం వేస్తున్నారు. జల్లి పట్టిన, తేమ 12 శాతం ఉన్నప్పటికీ తరుగు తీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తరుగును అరికట్టాలి.

– చిగురు శ్రీనివాస్, నారాయణరావుపేట

తరుగు ఇస్తేనే అన్‌లోడ్



తరుగు కోసం ఎక్కువ తూకం వేస్తేనే మిల్లుల్లో అన్‌లోడ్ చేసుకుంటున్నారు. లేకపోతే అన్‌లోడ్ చేసుకోమని చెబుతున్నారు. విధిలేని పరిస్థితిలో కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి పెట్టాలి.

– సీకే శ్రీనివాస్, బక్రిచప్యాల

మా దృష్టికి రాలేదు



కొనుగోలు కేంద్రాల్లో వడ్లకు తరుగు తీస్తున్నారని మా దృష్టికి రాలేదు. రైతులు ఎవరూ చెప్పలేదు. వడ్లను అన్‌లోడ్ చేసే సమయంలో తరుగు తీస్తే చర్యలు తీసుకుంటాం.

–హరీశ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

ఎంపీ నిధులకు ‘ఈ–సాక్షి’

ఇక ఎంపీలాడ్స్ పనులపై కేంద్రమే పర్యవేక్షణ

- ప్రత్యేక పోర్టల్ ద్వారానే అమలు
- మిగిలిపోయిన నిధులను వెనక్కి పంపాలని ఆదేశాలు
- ఆ మేరకు చర్యలు చేపట్టిన కలెక్టర్లు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పార్లమెంట్ సభ్యుల (ఎంపీల) నిధుల వ్యయాన్ని ఇకపై కేంద్ర ప్రభుత్వమే నేరుగా పర్యవేక్షించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు ఈ నిధులను జిల్లా కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసి.. వివిధ అభివృద్ధి పనులకు వెచ్చించేవారు. ఇకపై ఇలా చేయడం కుదరదని, ప్రత్యేక పోర్టల్ ఈ–సాక్షి ద్వారా ఈ నిధులను ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంపీ లాడ్స్ (మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీం) పథకం కింద కేంద్రం ఏటా ఒక్కో ఎంపీకి రూ.ఐదు కోట్లు మంజూరు చేస్తుంది. లోక్‌సభ సభ్యులతో పాటు, రాజ్యసభ సభ్యులకు కూడా ఈ నిధులను కేటాయిస్తుంది. రెండు, మూడు విడతల్లో ఈ నిధులు విడుదలయ్యేవి. ఎంపీలు ఏ జిల్లాను తమ నోడల్ జిల్లాగా ఎంపిక చేస్తే.. ఆ జిల్లా కలెక్టర్ ఖాతాలో ఈ నిధులు జమ అయ్యేవి. ఎంపీలు ప్రతిపాదించిన పనులను సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ (ఇంజినీరింగ్ శాఖ) ల ద్వారా ఈ పనులు చేయించి.. బిల్లులు ఇచ్చేవారు. జిల్లా ప్రణాళికశాఖ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుంది. ఇకపై ఈ–సాక్షి పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్ ద్వారా ఈ నిధుల వ్యయాన్ని పర్యవేక్షించనున్నారు.

ఉన్న నిధులు వెనక్కి పంపాలని ఆదేశం..

ఎంపీ లాడ్స్ పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలకు వచ్చిన నిధుల్లో ఖర్చు కాకుండా మిగిలిపోయిన నిధులను కూడా వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఇటీవలే కలెక్టర్లు తమ జిల్లాల్లో మిగిలిన ఎంపీ లాడ్స్ నిధులను కేంద్రం సూచించిన ఖాతాల్లో జమ చేశారు. ఇలా ఒక్క సంగారెడ్డి జిల్లా నుంచే 16వ లోక్‌సభ, 17వ లోక్‌సభ ఎంపీలకు సంబంధించి మిగిలిపోయిన సుమారు రూ.7.15 కోట్లు వెనక్కి వెళ్లాయి.

నిధులు పక్కదారి పట్టకుండా..

ఎంపీ లాడ్స్ నిధుల ఖర్చు విషయంలో పలు విమర్శలున్నాయి. ఈ నిధులపై పూర్తి అధికారాలు ఉండటంతో ఎంపీలు ప్రజాప్రయోజనాల పనుల కంటే.. తమ అనుచరులు, కార్యకర్తలకు కలిసొచ్చే పనులకే ప్రాధాన్యత ఇస్తుంటారనే చర్చ ఉంది. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్‌ల నిర్మాణం వంటి పనులకే ప్రాధాన్యత ఇస్తుంటారు. టెండర్లు పెట్టకుండానే నామినేషన్‌పై పనులు కార్యకర్తలకు, అనుచరులకు కట్టబెడుతుండటం పరిపాటిగా మారుతోంది. దీంతో ఈ పనుల్లో నాణ్యత పూర్తిగా ప్రశ్నార్థకంగా మారుతోంది. మరోవైపు కొందరు ఎంపీలు ఎంపీ లాడ్స్ మార్గదర్శకాలకు విరుద్ధంగా కూడా కొన్ని పనుల ఎంపిక జరిగేది. ఇలా ఈ పథకంలో జరుగుతున్న అవకతవకలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ నిధులను నేరుగా పోర్టల్ ద్వారా పర్యవేక్షించాలని నిర్ణయించింది. తద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వైభవంగా నీలకంఠేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం గౌరీ సహిత నీలకంఠేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మశ్రీ ఉమాపతి రామేశ్వర శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల నృత్యాలు, భక్తి గీతాలు, ఆటలు, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంతకు ముందు పదోతరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలలో రాణించిన నీలకంఠ సమాజ విద్యార్థులను సన్మానించి, నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు, కడవేర్గు రాజు, తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవ వైభవం

- భక్తజన నీరాజనం
- నేడు దివ్యవిమాన రథోత్సవం



హారతి ఇస్తున్న భక్తజనం

వర్గల్(గజ్వేల్): అంగరంగ వైభవంగా సాగుతున్న వర్గల్ వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు భక్తజనావళికి నేత్రపర్వం చేస్తున్నాయి. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, హోమం, సేవాది కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. బుధవారం వేడుకలలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. రాత్రివేళ భక్తజనులు స్వామివారికి హారతులతో నీరాజనం పట్టారు. బ్రహ్మోత్సవాలలో కీలకమైన దివ్యవిమాన రథంపై రుక్మిణీ,సత్యభామ సమేతులై వేణుగోపాలుడు పురవీధులలో ఊరేగుతూ దర్శనమిచ్చే అద్వితీయ ఘట్టం గురువారం ఆవిష్కృతం కానున్నది. తెల్లవారుజామున 4.30 గంటలకు ఆలయ మండపం ముందర విమాన రథప్రతిష్ఠ, బలిహరణాది కార్యక్రమాలు, ఉదయం 7 గంటలకు విమాన రథోత్సవ ఊరేగింపు ప్రారంభమవుతుందని ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు తెలిపారు. పురవీధులలో శ్రీవేణుగోపాలుని రథోత్సవ వైభవం ప్రత్యక్షంగా తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఇందుకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

- అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే తెరపైకి ఫోన్ ట్యాపింగ్
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకొనేందుకే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చిందని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని చెప్పారు. పింఛన్ , రైతు బంధు పెంపు, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2500 పంపిణీ, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,500, ఆటో కార్మికులకు రూ.12,500 చెల్లింపు మాటలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలను మానుకొని ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 1నుంచి 3వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, నాయకులు నూనె కుమార్, ఉపేందర్‌రెడ్డి, కవితా రెడ్డి, బాల్‌రెడ్డి, ఇంద్రసేనరెడ్డి, జుబేర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగిరం చేయండి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఎం, మెప్మా అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గరీమా అగర్వాల్ మాట్లాడుతూ ఈజీఎస్ పనుల్లో భాగంగా డంపింగ్ యార్డు, వైకుంఠధామాలు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే హరితహారానికి సంబంధించి టార్గెట్ మేర నర్సరీలలో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. జూన్ నెల 5వ తేదీ లోపు పాఠశాలలకు మొదటి విడత స్కూల్ యూనిఫాం పంపిణీ చేయాలన్నారు. స్టిచ్చింగ్‌లో, పంపిణీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎంఆర్ ఇవ్వడానికి మిల్లర్లు సిద్ధం

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

సిద్దిపేటకమాన్: యాసంగికి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వడానికి మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాయలంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా కంటే ముందు మిల్లర్లకు అప్పజెప్పిన ధాన్యం మరాడించి ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు. తదనంతరం 2021–22లో ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరగడంతో మిల్లుల కెపాసిటీకి మించి ధాన్యం దిగుమతి చేసినట్లు తెలిపారు. అప్పటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య సఖ్యతలేని కారణంగా, దీనికి మరాడించిన బియ్యం దిగుమతి చేసుకొవడానికి ప్రభుత్వం వద్ద సరైన స్థలం లేక మిల్లర్ల వద్దే ఆ బియ్యం ఉండిపోయిందన్నారు. స్థలాభావం కారణంగా రబీ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ దిగుమతి కోసం ఒక్కొక్క లారీ 3రోజుల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. జిల్లా పరిధిలో సుమారు 150 మిల్లులకు సంబంధించి రూ.100 కోట్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 2023 యాసంగి సంబంధించి టెండర్ ధాన్యం నిల్వ ఉంచిన నేపథ్యంలో తరుగు, హమాలీ, గోదాం కిరాయి కలుపుకొని క్వింటాల్‌కు రూ.500 మిల్లర్లుకు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సెక్రటరీ బుచ్చయ్య, వైస్ ప్రెసిడెంట్ బాలకిషన్ రావు, జాయింట్ సెక్రటరీ శివకుమార్, మాజీ కోశాధికారి ఉప్పల భూపతి, అడ్వైజర్ కాశీనాథ్, మిల్లర్ మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం



ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న నర్సారెడ్డి తదితరులు

- మంచాల అనసూయకు దక్కిన పదవి
- 85 రోజుల ఉత్కంఠకు తెర
- సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు

కొండపాక(గజ్వేల్): ఎంపీపీగా కొండపాకకు చెందిన మంచాల అనసూయ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన అనసూయ ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేసి పాలన పగ్గాలు చేపట్టారు. మండలంలో 14 మంది ఎంపీటీసీలకు గాను కుకునూరుపల్లి 2వ ఎంపీటీసీ అనారోగ్యంతో మృతి చెందగా 13 మంది సభ్యులతో బీఆర్ఎస్‌కి చెందిన ర్యాగల్ల సుగుణ ఎంపీపీ పదవిలో కొనసాగారు. ఎంపీపీ పదవిపై మార్చి 5న ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో మార్చి 28న అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఎంపీపీ పదవి కోసం ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ అధికారి డీఆర్‌డీఓ అదనపు పీడీ బాలకృష్ణ ఎంపీటీసీల సమక్షంలో ఏర్పాట్లు చేశారు. ఈక్రమంలో హాజరైన 13 ఎంపీటీసీల్లో మంచాల అనుసూయ నామినేషన్ దాఖలు చేసింది. మిగతా వారు ఎవ్వరు నామినేషన్ దాఖలు చేయకపోగా బీఆర్ఎస్ ఎంపీటీసీలు మద్దతు తెలపడంతో ఎంపీపీగా అనసూయ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల నిర్వహణ అధికారి బాలకృష్ణ ప్రకటించారు. అనంతరం అనసూయతో ప్రమాణ స్వీకారం చేయించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా మీటింగ్ హాల్లోకి ప్రవేశించి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డిలతో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లు, నాయకులు అనసూయను శాలువాతో ఘనంగా సన్మానించారు. 13 మంది ఎంపీటీసీల్లో కేవలం ముగ్గురు ఎంపీటీసీలున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ పదవిని దక్కించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఎంపీపీ పదవి ఎన్నిక కోసం 85 రోజులుగా సాగిన ఉత్కంఠకు తెరపడింది.

పారదర్శక పాలన అందిస్తా: ఎంపీపీ



మండల వ్యాప్తంగా ప్రజలకు పారదర్శకమైన పాలన అందిస్తానని నూతన ఎంపీపీ మంచాల అనసూయ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపికకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిరంకుశ పాలన నుంచి విముక్తి: నర్సారెడ్డి

బీఆర్ఎస్ నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించిందని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. కొండపాక మండలంలోని ఎంపీపీ అత్యవసర సమావేశ మందిరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎంపీపీ హయాంలో ఇబ్బందులు పడ్డ ఎంపీటీసీలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వేచ్ఛాపాలన అందించేందుకు కాంగ్రెస్‌లో చేరి ఎంపీపీ పదవిని దక్కించుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పని చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న జడ్జీలు, తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగాను అలవర్చుకోవాలని తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ (టీవైఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు సూచించారు. 4వ రాష్ట్ర స్థాయి యోగాసన్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం గుమ్మడిదల మండలంలోని ప్రకృతి నివాస్‌లో ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జడ్జీలకు యోగాపై శిక్షణను అందించనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుతోపాటు టీవైఎస్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, సెక్రటరీ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ క్రాంతి


మ్యాప్ పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్: జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరి అధికారులకు సూచించారు. బుధవారం జహీరాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో నిమ్జ్ భూసేకరణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిమ్జ్ భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం రూ.54 కోట్లు విడుదల చేసిందని, రైతులకు వెంటనే పరిహారం అందజేయాలన్నారు. భూ సేకరణపై కోర్టులో ఉన్న కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. సమావేశంలో ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీఓ రాజు, జోనల్ అధికారి అనురాధ, డీటీ రాచయ్య, దావూద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): డీబీఎఫ్ నాల్గవ మహాసభల సందర్భంగా హైదరాబాద్‌లో గురువారం భారత రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ తెలిపారు. మండల పరిధిలోని లింగుపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ... ప్రతీ రెండేళ్లకోసారి డీబీఎఫ్ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాల్గవ మహాసభ హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తామన్నారు. సమ్మేళనానికి జస్టిస్ చంద్ర కుమార్, మాజీ ఐఏఎస్‌లు గోపాల్‌రావు, ఆకునూరి మురళీ తదితరులు హాజరవుతారని తెలిపారు. సమ్మేళనానికి కవులు, కళాకారులు, మేధావులు, కార్మిక కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా నాయకులు భీం శేఖర్, కిరణ్, బాల్ నర్సు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

జేసీబీ, మూడు టిప్పర్లు పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): చిలాపూర్ పల్లె నుంచి బెజ్జంకి మండల కేంద్రానికి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, మూడు టిప్పర్లను మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని బెజ్జంకి పోలీస్‌స్టేషన్ తరలించినట్లు ఎస్‌ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు చిలాపూర్‌పల్లెకు వెళ్లగా అక్కడ ఒకరి బావి వద్ద మట్టిని తీస్తున్నట్లు తెలిపారు. అలాగే బెజ్జంకి, మండలంలోని గాగిళ్లాపూర్ శివారులో గల మోయతుమ్మెద వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఏడుపాయల్లో కన్నీటి ధారలు

- మూడేళ్లలో 24 మంది జలసమాధి
- మద్యం మత్తులో చిత్తవుతున్న బతుకులు
- కనిపించని స్నానపు ఘాట్లు
- ఎక్కడపడితే అక్కడే భక్తుల స్నానాలు
- మంజీరా చుట్టూ లేని ఫెన్సింగ్

ఏడుపాయల్లో ప్రవహించే మంజీరా ధారలు భక్తుల రక్తంతో ఎరుపెక్కుతున్నాయి. స్నానాల కోసం నదిలోకి దిగే భక్తులు మద్యం మత్తు, బండరాళ్ల మధ్యలోనో ఇరుక్కొని జల సమాధి అవుతున్నారు. పుణ్యం కోసం ఎల్లలు దాటి వచ్చే భక్తులు కొంత మంది ప్రాణాలు కోల్పోగా.. వారి కుటుంబీకులు విషాదాన్ని మూట గట్టుకొని ఇళ్లకు మళ్లుతున్నారు. ఏడుపాయల్లో ఏరులై పారుతున్న మద్యం ఎక్కువ జల మరణాలకు మూలమవుతోంది.

పాపన్నపేట(మెదక్)

తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన ఏడుపాయలకు ఏటా 20 లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఏడుపాయలుగా చీలి ప్రవహించే మంజీరా పాయల మధ్యన వెలసిన వన దుర్గమ్మ లక్షలాది భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ప్రతీ యేటా మహాశివరాత్రి జాతరకు, మాఘ అమావాస్య, దసరా నవరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు.

మద్యం మత్తులో స్నానాలు

ఏడుపాయల చుట్టూరా పరవళ్లు తొక్కుతూ ప్రవహించే మంజీరా పాయలు ప్రమాదకరమైన బండ రాళ్లతో కూడుకొని ఉన్నాయి. జలసిరిని చూసి మైమరచి పోయే భక్తులు మృత్యు మర్మం తెలియక మంజీరా నదిలో స్నానాలు చేసేందుకు దిగుతుంటారు. అయితే, ఏడుపాయల్లో విచ్చల విడిగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. అక్కడ మద్యం దొరకని దుకాణం లేదు. చాలా మంది మద్యం సేవించి నీటిలో స్నానాలు చేసేందుకు వెళ్లి బండ రాళ్ల మధ్య ఇరుక్కొని చనిపోతున్నారు. వారం రోజుల్లో ముగ్గురు యువకులు ఇదే రీతిన మృత్యువాత పడ్డారు. స్నానం చేయడానికి స్నాన ఘాట్లు లేక పోవడంతో భక్తులు ఎక్కడ పడితే అక్కడ స్నానాలు చేసేందుకు మంజీరా నదిలోకి దిగి నీట మునిగిపోతున్నారు. మంజీరా చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, స్నానపు ఘాట్లు నిర్మించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం చెక్ డ్యాం వద్ద సెక్యూరిటీ సిబ్బంది విధిలో ఉన్నా కొంత వరకు రక్షణ కల్పించవచ్చు.

సరదాగా ఈతకు వెళ్లి యువకుడు మృతి

ప్రమాదవశాత్తు నీట మునిగి యువకుడు మృతిచెందిన ఘటన వనదుర్గా ప్రాజెక్టు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం మేరకు.. పెద్దశంకరంపేట మండలం బుర్జుగ్‌పల్లికి చెందిన డోవూరి కిరణ్ కుమార్ (22) బుధవారం స్నేహితులతో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. దర్శనం అనంతరం సాయంత్రం ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. ప్రాజెక్టులో సరదాగా ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. స్నేహితులు స్థానికుల సాయంతో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలించగా బుధవారం రాత్రి మృతదేహం లభ్యమైంది.


మంజీరాలో మునిగి చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు (ఫైల్)

24 మంది జలసమాధి

2022 నుంచి 27 మే 2024 వరకు ఏడుపాయల్లో 24 మంది భక్తులు నీట మునిగి చనిపోయారు. 12 ఏప్రిల్ 22న మనోహరాబాద్ మండలం దండుపల్లికి చెందిన ఇద్దరు నీట మునిగి చనిపోయారు. మే 22 ఒకరు, జూన్ 6వ తేదీన కామరెడ్డి జిల్లా నసీరుల్లాబాద్‌కు చెందిన బక్క సాయిలు, వికారాబాద్‌కు చెందిన మహ్మద్ హకీం నీట మనిగి మృత్యువాత పడ్డారు. 2023లో ఎనిమిది మంది, 2024లో ఏడుగురు నీట మునిగి చనిపోయారు. భక్తుల మరణానికి బాధ్యులెవరని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేస్తాం

ఏడుపాయల్లో జల మరణాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటాం. చెక్ డ్యామ్‌లో నది మధ్య ఉన్న బండరాళ్లను తొలగించి, ప్రమాదకర పరిస్థితులను చక్కదిద్దే ఆలోచనలో ఉన్నాం. మద్యం అమ్మకాలు అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం.

–మోహన్‌రెడ్డి, ఈఓ, ఏడుపాయల


చాకరిమెట్లలో భక్తజన సందోహం

ఘనంగా మహారుద్ర పారాయణం

- 500 మంది రుత్వికుల పూజలు
- హాజరైన ప్రముఖులు

శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్ల పరిధి చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన మహారుద్ర పారాయణం, విశేష పూజలతో ఆలయం భక్తజనంతో నిండిపోయింది. లోక కల్యాణార్థం మాధవానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 500 మంది రుత్వికులు మహారుద్ర పారాయణం, సహస్ర శ్రీ సూక్తము, సహస్ర మన్యుసూక్తము, పురుష సూక్తము, లక్ష తమలార్చన మహోత్సవం, శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మాధవానంద సరస్వతీ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు సందేశం ఇచ్చారు. చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామిని భక్తితో కొలిస్తే అనుకున్న లక్ష్యం నెరవేరేందుకు సహకారం తప్పకుండా అందిస్తాడన్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, ఉన్నారు.

పూజల్లో ప్రముఖులు

సహకార ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజ మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, మైనంపల్లి హన్మంత్‌రావు, పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీజేపీ నాయకుడు వాల్దాస్ మల్లేశ్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు రమణగౌడ్, చంద్రాగౌడ్, నారాయణరావు, సుదర్శన్‌గౌడ్, పూల్‌సింగ్, బండారు గంగాధర్, శ్రీపాదరావు, హర్షనాయక్, నరేందర్, పాపయ్యాచారి, నాగేశ్వర్‌రావు, జగన్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


పూజా మహోత్సవంలో మాధవనాంద సరస్వతీ, ఎమ్మెల్యే సునీతారెడ్డి


పూజలో హన్మంత్‌రావు, మదన్‌రెడ్డి, రాజిరెడ్డి, నీలం మధు, రాజిరెడ్డి

కులం పేరుతో వ్యక్తిగత దూషణలు

- హనుమాన్ స్వాములు, కొందరు గ్రామస్తుల మధ్య వాగ్వాదం
- సీతారాంపల్లిలో అట్రాసిటీ కేసు నమోదు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీను, ఎస్‌ఐ

సిద్దిపేటరూరల్: దళిత సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులు హనుమాన్ మాల ధరించి గుడిలో పూజ చేసుకోవడానికి వెళ్లగా అగ్ర కులస్తులు అడ్డుకోవడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఘటన బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాం పల్లి గ్రామంలో జరిగింది. సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి కథనం మేరకు.. ఎస్సీ వర్గానికి చెందిన కొంతమంది కొద్ది రోజుల కిందట హనుమాన్ మాల దీక్ష స్వీకరించారు. మంగళవారం హనుమాన్ పూజ చేసుకోవడానికి గ్రామంలో ఉన్న హనుమాన్ గుడిలోకి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన దొంగల శ్రీకాంత్ రెడ్డి , గుర్రం భూంరెడ్డి, చింతల మహేశ్ గౌడ్ లు మీరు ఎస్సీ కులానికి చెందినవారని, గుడిలోకి రావద్దంటూ బెదిరించి గుడి బయటే నిలబెట్టారు. మీరు గుడిలోకి రావాలంటే మీ ఇంటి, కులం పేరు మార్చుకుంటేనే రావాలన్నాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో గ్రామానికి చేరుకున్న ఎస్సై అపూర్వ రెడ్డి వివరాలు సేకరించారు. బాధితుడు మిట్టపల్లి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. సీఐ శ్రీను మాట్లాడుతూ కులం పేరుతో వ్యక్తిగత దూషణలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


నర్సయ్య (ఫైల్)

కొండపాక(గజ్వేల్): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్ గ్రామానికి చెందిన కిష్టపురం నర్సయ్య (65) మీ సేవా కేంద్రంలో పని ఉందంటూ బుధవారం సాయంత్రం ఇంట్లో చెప్పి సైకిల్‌పై వెళ్లాడు. సైకిల్‌ను కుకునూరుపల్లిలోని గ్రామ పంచాయతీ సమీపంలో నిలిపి నడుచుకుంటూ మీ సేవా వైపునకు రోడ్డును దాటుతున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నర్సయ్యను ఢీ కొట్టడంతో టైర్ల కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో పడి ఉండగా సమాచారం అందుకున్న కుటుంబీకులు హుటాహుటినా గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవరు ఎండీ నజీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెంకటేశం హత్య కేసులో నలుగురి అరెస్టు

పరారీలో మరో నలుగురు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌కు చెందిన మల్లోడ్డి వెంకటేశంను కిడ్నాపర్లు హత్య చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం బుధవారం తెలిపారు. ఈ నెల 23న కల్హేర్‌లో మల్లొడ్డి వెంకటేశం కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. వెంకటేశం భార్య విజయ ఫిర్యాదు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం లాడెగావ్‌కు చెందిన మల్లోడ్డి వెంకటేశం సోదరి గంగామణి, మేన అల్లుడు నరేందర్ పథకం వేసి సుపారీ గ్యాంగ్‌తో కిడ్నాప్ చేయించారు. వెంకటేశం కూతురుతో గంగామణి కొడుకు ట్రాన్స్‌కో ఏఈ నరేందర్‌కు వివాహం జరిగింది. ఏడాదిలోనే విడిపోగా నరేందర్ రెండో పెళ్లి చేసుకున్నాడు. తనకు పిల్లలు కాకూడదని మామ మల్లొడి వెంకటేశం బాణమతి చేస్తున్నాడని పగ పెంచుకున్నాడు. వెంకటేశంను హత్య చేయాలని పథకం పన్నాడు. 23న కల్హేర్ శివారులో కళ్లలో కారం చల్లి, కరెంట్ షాక్‌తో చిత్రహింసలు పెట్టారు. కిడ్నాప్ చేసి తుఫాన్ వాహనంలో తీసుకెళ్లారు. జుక్కల్ వద్ద గంగామణి, నరేందర్ చేరుకున్నారు. నరేందర్ కారులో దోస్తుపల్లి అక్కడి నుంచి మహారాష్ట్రలోని దెగ్లూర్ శివారులో తరలించారు. అక్కడ విచక్షణరహితంగా కొట్టి చంపేశారు. కారు డిక్కీలో 24న ఉదయం ఉద్గీర్ సమీపంలో దేవర్జన్ శివారు అటవీ ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న బావిలో శవాన్ని పడేశారు. ఈ కేసుకు సంబంధించి నరేందర్ అతడి తల్లి గంగామణి, బాబాన్ కంబేలె, తుఫాన్ డ్రైవర్ విఠల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇంకా నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

పాడి రైతులకు బిల్లులు అందించాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్


డీడీ గోపాల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాడి రైతులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాడి రైతులకు అందించాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. తెలంగాణ రైతు సంఘం, పాడి రైతుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (విజయ డెయిరీ) ఉప సంచాలకుడు(డీడీ) గోపాల్ సింగ్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. పాడి రైతులకు పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలని, పాడి రైతులకు లీటర్ కు రూ. 4 ఇన్సెంటీవ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 7.5 లక్షల మంది పాడి రైతులు రోజుకు 4 లక్షల లీటర్ల పాలు విజయ డెయిరీకి విక్రయిస్తున్నారన్నారు. పాడి రైతులకు ప్రతీ పదిహేను రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉండగా, చెల్లింపుల్లో జాప్యం చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని కమిటీలు వేయాలని, సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. లీటర్ పాలకు రూ.4 ఇన్సెంటీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చల్లారపు తిరుపతి రెడ్డి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, పాడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ బద్దిపడగ కృష్ణారెడ్డి, నాయకులు నక్కల యాదవ రెడ్డి, కృష్ణారెడ్డి, కనకాచారి, మల్లారెడ్డి, భూపతి రెడ్డి, నర్సింహులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


భూమిక

టేక్మాల్(మెదక్): యువతి అదృశ్యమైన ఘటన టేక్మాల్ మండలంలోని అచ్చన్నపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పడమటి భిక్షపతి కుమార్తె భూమిక (21) మల్లారెడ్డి నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతుంది. వేసవి సెలవుల కారణంగా ఇంటికి వచ్చింది. ఈ నెల 28న రాత్రి అందరూ తిని నిద్రించారు. మరుసటి రోజు తెల్లారేసరికి భూమిక కనిపించ లేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ రావడంతోపాటు చుట్టు పక్కలా, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

జహీరాబాద్: కోహీర్ మండలంలోని బడంపేట గ్రామానికి చెందిన బేగరి నర్సింహులు(45) హత్య కేసులో బుధవారం నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈనెల 18వ తేదీన నర్సింహులును అదే గ్రామానికి చెందిన వ్యక్తులు కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడని, చికిత్స పొందుతూ ఈనెల 26వ తేదీన ఆస్పత్రిలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. హత్య కేసులో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులుగా ఉన్న గొల్ల మల్లేశ్, పట్లోళ్ల సందీప్, పట్లోళ్ల రాహుల్‌లను కోహీర్ క్రాస్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


ఇంట్లో కనకయ్య మృతదేహం

జగదేవ్‌పూర్(గజ్వేల్): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌కు చెందిన డప్పు యాదగిరి, నర్సవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుర్లు. యాదగిరి కొన్నేళ్ల కిందటే మృతి చెందగా, చిన్న కుమారుడు కనకయ్య(24) తల్లి నర్సవ్వ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నర్సవ్వ నాలుగు రోజుల కిందట రెండవ కూతురు డెలివరీ ఉండడంతో వారి ఇంటికి వెళ్లింది. కనకయ్య ఇంటి తలుపులు మూసే ఉన్నా ఎవరూ గమనించలేదు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు కిటికిలోంచి చూడగా కనకయ్య ఇంట్లో మృతి ఉన్నాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కనకయ్య మద్యం మత్తులో లేదా పాయిజన్ తీసుకొని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రూ.34,820 జరిమానా కట్టాల్సిందే


ఓపెన్ ఫోరంలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

- ఉపాధి హామీలో బయటపడ్డ అవకతవకలు
- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా

సిద్దిపేటరూరల్: 2023–24 సంవత్సరానికి సంబంధించి నారాయణరావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగాయని, ఫీల్డు అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు జరిమానా కట్టాల్సిందే అని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్యా ఆదేశించారు. 3వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా అన్ని గ్రామాలకు సంబంధించి రూ.34,820 రికవరీ ఉన్నట్లు తేలిందన్నారు. కొద్ది రోజులుగా అన్ని గ్రామాల్లో జరుగుతున్న సామాజిక తనిఖీలకు సంబంధించి బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవనంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో రూ.కోటి 98 లక్షల విలువైన పనులు జరిగాయని ఓపెన్‌ఫోరంలో ఉన్నతాధికారులు జయదేవ్ దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 34,820 రికవరీ బయటపడిందని, నారాయణరావుపేట మండల కేంద్రంలో అత్యధికంగా రూ.15,570 జరిమానా, రికవరీ బయటపడిందన్నారు. అనంతరం జయదేవ్ ఆర్యా మాట్లాడుతూ.. ఉపాధి హామీలో భాగంగా కూలీలకు పని కల్పించడంలో 3 వారాలుగా వెనుకబడిందన్నారు. అధికారులు అందరి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. హరితహారం మొక్కల పెంపకం 31 వేల మొక్కలు అయినప్పటికీ నర్సరీల్లో వాటితోపాటు మునగ, కరివేపాకు, గులబర్గ వంటి మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శివాజీ, డీపీఓ ప్రభాకర్, ఎంపీడీఓ శ్రీరాములు, క్వాలిటీ కంట్రోలర్ సంతోష్ రెడ్డి, ఏపీఓలు నూరొద్దిన్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దాహం తీరేలా..



బడంపేట అడవిలో సాసర్ పిట్‌లో పోస్తున్న నీరు

- అడవుల్లో 30 సాసర్ పిట్‌ల ఏర్పాటు
- ఎండ తీవ్రతకు అల్లాడుతున్న జంతువులు
- నీరు పోసి దాహార్తి తీరుస్తున్న అటవీ సిబ్బంది
- బీట్‌ల వారీగా బాధ్యతలు

జహీరాబాద్: ఎండల తీవ్రతతో అటవీ జంతువులు దాహం తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి. అడవుల్లో సహజ నీటి లభ్యత లేకపోవడంతో సిబ్బంది సాసర్ పిట్‌లలో నీళ్లు పోసి దాహార్తి తీరుస్తున్నారు. కానీ ఆ మేరకు అడవుల్లో సాసర్‌పిట్‌లు లేకపోవడంతో అటవీ జంతువులు దప్పిక తీర్చుకోలేక పోతున్నాయి. జహీరాబాద్ డివిజన్ పరిధిలో సుమారు 2,000 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. అటవీ ప్రాంతాలను మూడు బీట్‌లుగా ఏర్పాటు చేశారు. జహీరాబాద్, దిగ్వాల్, కోహీర్ బీట్లుగా విభజించి ఒక్కో బీట్‌కు అధికారిని నియమించారు. బీట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సిబ్బంది అడవిలో సాసర్ పిట్‌లలో నీటిని పోయించే పనులు చేస్తున్నారు. అడవుల్లో ప్రధానంగా కొండ గొర్రెలు, జింకలు, నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు ఉన్నాయి. వీటిలో జింకల సంఖ్య అధికంగా ఉంది. ఎండల తీవ్రతను తట్టుకోలేక జింకలు నీటి వసతులు ఉన్న ప్రాంతాలకు వెళ్లి దాహార్తిని తీర్చుకుంటున్నాయి. అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న వ్యవసాయ బావులను సైతం ఆశ్రయిస్తున్నాయి. డివిజన్ పరిధిలో 30 మేర సాసర్ పిట్లను ఏర్పాటు చేసి వాటిలో ట్యాంకర్ల ద్వారా నీటిని పోయిస్తున్నారు. వారానికి రెండు నుంచి మూడు పర్యాయాలు సాసర్ పిట్‌లను నీటితో నింపుతున్నారు. ఇందు కోసం ఆరు ట్యాంకర్లను వినియోగిస్తున్నారు.

విస్తరించిన అడవులు

జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 2,000 ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. జహీరాబాద్ బీట్ కింద జహీరాబాద్, తూంకుంట, హోతి(కె), గోపన్‌పల్లి, మన్నాపూర్, మొగుడంపల్లి, పర్వతాపూర్ ప్రాంతాలు ఉన్నాయి. కోహీర్ బీట్ కింద బడంపేట, మనియార్‌పల్లి, సజ్జాపురం, గొటిగార్‌పల్లి ప్రాంతాలు ఉన్నాయి. దిగ్వాల్ బీట్ కింద దిడిగి, దిగ్వాల్, న్యాల్‌కల్, శంశల్లాపూర్, న్యామతాబాద్, హుసెళ్లి, మునిపల్లి, రాయికోడ్, ఝురాసంగం ప్రాంతాలు ఉన్నాయి.